సాక్షి
పెద్దపల్లి

బుధవారం ꠰ 22 ꠰ జనవరి ꠰ 2025

## 9 రోజుల్లో సబ్‌స్టేషన్ నిర్మాణం

పెద్దపల్లిరూరల్: జిల్లా విద్యుత్ శాఖ అధికారులు కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే ఐదు మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి రికార్డు సృష్టించారు. అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి వద్ద గల బ్యాక్ వాటర్‌ను ఎత్తిపోసేందుకు వీలుగా రూ.1.30 కోట్ల వ్యయ అంచనాలతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను అత్యంత స్వల్పకాలంలో నిర్మించామని ఎస్ఇ మాధవరావు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యల్పకాలంలో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేయడాన్ని సీఎండీ కరుణాకర్‌రెడ్డి అభినందించారన్నారు.



బ్రాహ్మణపల్లిలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అధికారులు →

## న్యూస్‌రీల్

### కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



అధికారులతో సమావేశమైన ఎంపీ వంశీకృష్ణ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ జ్యోతిభవన్‌లో ప్రాజెక్టు అధికారులతో సమావేశమయ్యారు. 2018లో జరిగిన ఒప్పందం ప్రకారం కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, త్వరలో గేట్ పాస్‌లు ఇచ్చేందుకు విధివిధానాలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఎన్టీపీసీ ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, భూమల్ల చందర్, భూమయ్య, వెంగల బాపు తదితరులు పాల్గొన్నారు.

**రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులపై ఎంపీ ఆరా**

రామగుండం: అమృత్ భారత్ పథకంలో భాగంగా రామగుండం రైల్వేస్టేషన్‌లో చేపట్టిన ఆధునికీకరణ పనులపై మంగళవారం ఎంపీ వంశీకృష్ణ క్షేత్ర పర్యటన చేశారు. పనులు ప్రారంభించి ఏడాదిన్నర పూర్తవుతున్న పనులు నత్తనడకన కొనసాగుతుండటంపై సంబంధిత రైల్వే ఉన్నతాధికారులతో చర్చించారు. మార్చిలోగా పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు ఎంపీకి వివరించారు.

### సైన్స్‌పై అభిరుచి పెంచుకోవాలి



మాట్లాడుతున్న డీఈవో మాధవి

మంథని: సైన్స్‌పై విద్యార్థులు అభిరుచి పెంచుకోవాలని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. మంగళవారం మంథని మండలం ఎక్లాస్‌పూర్ జెడ్పీ పాఠశాలలో సీతారామ సేవాసదన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టు నారాయణతో కలిసి సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, పాఠశాల హెచ్ఎం జ్యోతి, సీతారామ సేవాసదన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి గణపతి, ఎంఈవో డి.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### వాహన డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోదావరిఖనిటౌన్: వాహన డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి రంగారావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆర్టీసీ డిపో సమీపంలో వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వాహనాలను అతివేగంగా నడుపొద్దని, ట్రాఫిక్ సిగ్నల్స్ తప్పక పాటించాలని, సంబంధిత పత్రాలు కలిగి ఉండాలన్నారు. అనంతరం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పెద్దపల్లి కళాకారుల సాంస్కృతిక బృందం దయానర్సింగ్ ఆధ్వర్యంలో పాటలు పాడి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రామగుండం ఎంవీఐ సంతోష్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్సై హరిశేఖర్, ముగ్గురు ఏఎంవీఐలు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టిజన్ల పేరిట అన్యాయం



రిలే దీక్ష శిబిరంలో నాయకులు

పెద్దపల్లిరూరల్: విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న వారికి ఆర్టిజన్ పేరుతో పాలకులు అన్యాయం చేస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి అన్నారు. పెద్దపల్లిలోని ట్రాన్స్‌కో ఎస్ఈ ఆఫీస్ వద్ద రెండురోజులుగా సంఘం జిల్లా అధ్యక్షుడు వాగునాయక్, నర్సయ్యల ఆధ్వర్యంలో చేస్తున్న ఆర్టిజన్ల దీక్ష శిబిరాన్ని మంగళవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. అంతకుముందు బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష, సీపీఎం జిల్లా కార్యదర్శి సదానందం శిబిరాన్ని సందర్శించి ఆర్టిజన్లకు న్యాయం చేయాలన్నారు నాయకులు దుర్గం మల్లేశ్, భిక్షపతి, సుంకరి సదానందం, కిషన్‌రెడ్డి, రాజు, విశ్వనాథ్, దేవేందర్, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లన్న, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# సారూ.. మా పేరు లేదు

- నాలుగు పథకాల లబ్ధిదారుల జాబితాలు గ్రామసభల్లో ప్రకటన
- నిలదీతలు, ప్రశ్నల వర్షం కురిపించిన ప్రజలు
- అర్హులకు చోటు దక్కలేదని ఆగ్రహం
- రసాభాసగా మారిన గ్రామసభలు



ఈచిత్రంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకోవాలంటూ పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న లబ్ధిదారులు కమాన్‌పూర్ మండలం పెంచికలపేట గ్రామానికి చెందిన వారు. ఈ గ్రామంలో మొత్తం 518మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, అందులో నలుగురు ఇటీవల చనిపోగా, మరో ఐదుగురు స్థానికంగా లేకపోవడంతో 509 కుటుంబాలను అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఇందులో 279మంది ఇంటి స్థలం ఉన్న వారు ఉండగా, 26మంది స్థలంలేని వారని, 305మంది అర్హులు అంటూ గ్రామసభలో అధికారులు జాబితాలోని పేర్లు చదవి వినిపించారు. అయితే జాబితాలో సుమారు 213మంది పేర్లు లేకపోవడంతో వారందరూ తమ పేర్లు లేవంటూ అధికారులను నిలదీశారు. దీంతో అధికారులు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని నచ్చజెప్పగా, ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకోవాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా మొదటి రోజు జరిగిన గ్రామసభల్లో అన్ని చోట్ల దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. లబ్ధిదారులు అధికారులను అనేక సందేహాలతో ప్రశ్నల వర్షం కురిపించారు.



- ఈ చిత్రంలో కంటతడి పెడుతూ కనిపిస్తున్న మహిళ రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన వాలకట్ల భూమక్క. మంగళవారం రేగడి మద్దికుంటలో నిర్వహించిన గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో పేరు ఉందని చదవటంతో ఆనందంతో భావోద్వేగంకు లోనై కంటతడిపెట్టింది.

సాక్షి, పెద్దపల్లి: సార్.. మా పేరు లిస్టులో లేదు. మాకు గుంట భూమి లేదు. ఆస్తులు లేవు. కనీసం రేషన్ కార్డు సైతం లేదు. ప్రజాపాలన, ప్రజావాణిలో అక్కడ ఇక్కడ అన్ని చోట్ల దరఖాస్తు చేసుకున్నాం. తీరా చూస్తే జాబితాలో మా పేరు లేదంటూ లబ్ధిదారుల నిలదీతలతో జిల్లావ్యాప్తంగా మంగళవారం మొదటి రోజు గ్రామసభలు జరిగాయి. భూస్వాములకు, అనర్హులకు జాబితాలో పేరు ఎక్కించారు. ఏం లేని వారి పేర్లు మాత్రం ఎక్కించలేదంటూ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కలిసి మెలిసి ఉండే ఊళ్లో గ్రామసభలు పెట్టి అనర్హుల పేర్లు జాబితాలో పెట్టి, అర్హులైన వారి పేర్లు పెట్టలేదు. ఒక్కరికి మీద ఒక్కరు ఫిర్యాదులు చేసుకోవాలా? అంటూ అధికారుల తీరుపై మహిళలు మండిపడ్డారు. జాబితాలో పేరు లేకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు నచ్చజెప్పడంతో పలు చోట్ల లబ్ధిదారులు మరోసారి దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా మొదటి రోజు గ్రామసభలు నిలదీతలు, నిరసనలు, బహిష్కరణలతో గరంగరంగా కొనసాగాయి. లిస్టులో పేరు ఉన్నవారు ఆనందం వ్యక్తం చేయగా, పేరు లేని వారు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించి తమ నిరసన వ్యక్తం చేశారు. మొదటి రోజున 90జీపీలు, మున్సిపాలిటీల్లోని 43 వార్డుల్లో సభలు జరిగాయి. పలు సభల్లో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, వేణు, ఎమ్మెల్యే విజయరమణరావు తదితరులు పాల్గొన్నారు.

**అయోమయం.. అసంతృప్తి**

ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమలు చేయబోతున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలను గ్రామసభల్లో అధికారులు చదవి వినిపించారు. జాబితాలో తమ పేరు ఉందని సంతోషపడేలోపు, ఇదే లిస్ట్ ఫైనల్ కాదు అని ఇందులో మొదటి దశలో కొంతమందిని ఎంపిక చేస్తామని అధికారులు చెప్పటంతో జాబితాలో పేర్లు ఉన్న వారిలో ఆయోమయం నెలకొంది. పేర్లు లేని వారు ఆందోళన చేస్తుండటంతో అధికారులు మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చని నచ్చజెప్పుతుండటంతో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలి అంటూ పలుచోట్ల మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

**అనర్హులకు చోటు కల్పించారంటూ..**

ధర్మారం మండలం కమ్మరిఖాన్‌పేట గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద కేవలం 52మంది లబ్ధిదారులనే ఎంపిక చేశారని, అందులో సగం మందికి వ్యవసాయ భూములున్నాయని, అసలు గుంట భూమి లేని వారికి మాత్రం జాబితాలో చోటు కల్పించలేదంటూ మాజీ సర్పంచ్ గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ బహిష్కరించారు. దీంతో చేసేది ఏమిలేక అధికారులు వెనుతిరిగారు.

**పోలీస్ నీడలో..**

మంగళవారం నిర్వహించిన గ్రామసభల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పహారా నిర్వహించారు. పలుచోట్ల అనర్హులను చేర్చారంటూ నిలదీస్తున్న వారిని పోలీసులు పక్కకు తీసుకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. అభ్యంతరాలు చెప్పేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని చెప్పి, పోలీసులతో ఎందుకు అడ్డుకుంటున్నారని పలుచోట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఈ దుకాణంలో కూర్చున్న వ్యక్తి పేరు దామపల్లి రాజమౌళి. ఆర్టీసీ రిటైర్డ్ మెకానిక్. స్వస్థలం హుజూరాబాద్. 20 ఏళ్లు ఉద్యోగం చేశాడు. పనిచేసే సమయంలోనే అధిక పింఛన్ కోసం దరఖాస్తు చేశాడు. రిటైరయ్యాక ముగ్గురు ఆడపిల్లల భవిష్యత్ కోసం ప్రణాళిక రూపొందించుకున్నాడు. ఉద్యోగ విరమణ పొంది, ఐదేళ్లు దాటినా అధిక పింఛన్ రావడం లేదు. ఆరోగ్యం సహకరించకున్నా కుటుంబ పోషణ కోసం కిరాణం నడుపుతున్నాడు.

# అందని ద్రాక్షలా అధిక పింఛన్



కరీంనగర్ ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రిటైర్డ్ ఉద్యోగులు (ఫైల్)

ఉద్యోగంలో చేరిన నాటినుంచి విరమణ పొందే వరకు ప్రతీ ప్రయాణికుడిని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు అధిక పింఛన్ అందని ద్రాక్షలా మారింది. డిమాండ్ నోటీసు మేరకు ఈపీఎఫ్‌వో అడిగిన సొమ్ము చెల్లించిన తర్వాత కొందరి దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మరికొందరివి 1995 నాటి నుంచి వివరాలు కావాలని మెలిక పెట్టారు. ఉద్యోగ విరమణ తర్వాత అధిక పింఛన్ ఏమోగానీ.. ఏరియర్స్ కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 11 డిపోల పరిధిలో సుమారు 4,800 మంది రిటైర్డ్ అయ్యారు. – హుజూరాబాద్

- వివరాలు 8లో ▸

## అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు

ధర్మారం: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకు అందించే బాధ్యత తమదేనని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ధర్మారం మండలం నందిమేడారంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అధికారులు ప్రకటించిన జాబితాలో పేర్లు లేకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దశల వారీగా నిరుపేదలకు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలోని మహిళా సంఘాలకు సోలార్ ప్రాజెక్టు నిర్మాణం అమలు చేసేలా చర్యలు జరుగుతున్నాయన్నారు.

**జాతీయస్థాయి క్రీడాకారులకు సన్మానం**

జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ధర్మారం మోడల్ స్కూల్ విద్యార్థులను మంగళవారం ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ సన్మానించి అభినందించారు. విద్యాలయంలోని 30 మంది రాష్ట్రస్థాయి, ఆరుగురు జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనడం హర్షణీయమన్నారు. మహారాష్ట్రలో ఈనెల 24 నుంచి జరిగే సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్న వైష్ణవికి ప్రయాణఖర్చులు అందిస్తానని తెలిపారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

మంథని/జూలపల్లి: ప్రభుత్వం చేపట్టబోయే నాలుగు నూతన పథకాలకు అర్హులను పారదర్శకంగా ఎంపిక చేసి లబ్ధి చేకూరుస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం మంథని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వార్డు సభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ఆధారంగా అర్హులను ఎంపిక చేసి అమలు చేస్తారన్నారు. ప్రాథమికంగా ప్రకటించిన జాబితాలో ఒకటి రెండు మిస్ అయినా ఎటువంటి ఆందోళన అవసరం లేదని, దరఖాస్తు అందిస్తే వారం పది రోజులలో విచారించి పథకాల లబ్ధి చేకూరుస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఎవరికైన సొంత ఇల్లు ఉండి సమాచారం ఇస్తే తొలగిస్తామన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని, అర్హులు ఇంకా ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ, మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**లబ్ధిదారుల ఎంపికకే గ్రామసభలు**

జూలపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు గ్రామసభలు ఏర్పాటు చేశామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. చీమలపేటలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో మాట్లాడారు. లబ్ధిదారులను ప్రజల సమక్షంలో ఎంపిక చేయడంతో సరైన నిరుపేద లబ్ధిదారులకు లాభం చేకూరుతుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి సహకారం అందిస్తానని తెలిపారు. మండల ప్రత్యేకాధికారి వెటర్నరీ ఏడీ శంకర్, ఎంపీడీవో పద్మజ, తహసీల్దార్ స్వర్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గండు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

### బాలికా సాధికారతకు ఎన్టీపీసీ అండ



మాట్లాడుతున్న జీఎం త్రిపాఠి

జ్యోతినగర్: బాలికాసాధికతకు ఎన్టీపీసీ రామగుండం తెలంగాణ ప్రాజెక్టు అండగా ఉంటుందని జనరల్ మేనేజర్ అలోక్‌కుమార్ త్రిపాఠి అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని మిలీనియం హాల్‌లో బాలికాసాధికారత మిషన్-2024 శీతాకాలపు ఐదో రోజుల శిక్షణను ప్రారంభించారు. ఎన్టీపీసీప్రభావిత, పునరావాస ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల బాలికలకు వేసవిలో నెల రోజుల పాటు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన బాలికల్లో 10 మందికి ఇంటర్మీడియెట్ వరకు ఉచిత విద్య అందిస్తున్నామని వెల్లడించారు. బాలికలకు స్టడీ కిట్‌లు అందించారు. దీప్తి మహిళా సమితి ఉపాధ్యక్షురాలు జ్యోత్స్న, రూపా సింగరాయ్, హెచ్ఆర్ అధికారి ప్రవీణ్ కుమార్ చౌదరి, కార్పొరేట్ కమ్యూనికేషన్ అధికారి రూపాలి రంజన్, సీఎస్సార్ అధికారులు సూర్యనారాయణ, క్రాంతిరెడి తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళన వద్దు.. పథకాలు అందిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్/జూలపల్లి: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి, జూలపల్లి మండలం నాగులపల్లె, చీమలపేట, తెలుకుంట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో మాట్లాడారు. పదేళ్లుగా రేషన్‌కార్డులు, ఇళ్లు ఇవ్వని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆందోళనలు మాని ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాల జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, ఎవరూ ఆందోళన చెందొద్దని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చడమే లక్ష్యమని అన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ దివ్యదర్శన్, ఏవో డేవిడ్‌రాజు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ‘చెత్త’గుండం

- రామగుండం బల్దియాకు తలనొప్పి
- డంపింగ్ యార్డుకు అడుగడుగునా ఆటంకాలు
- ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అదే డంపింగ్ యార్డు
- తాజాగా ఓసీపీ-4 ప్రాంత స్థలం కేటాయింపు
- అడ్డుకుంటున్న సమీప కార్పొరేటర్లు, ప్రాంతవాసులు



డంపింగ్‌యార్డు కోసం చదును చేస్తున్న ఓసీపీ-4 ప్రాంతం



అభ్యంతరం వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్లు, మేడిపల్లి సమీప ప్రాంతవాసులు

కోల్‌సిటీ(రామగుండం): చెత్తసేకరణలో దేశంలోనే ఒకప్పుడు ఆదర్శంగా నిలిచిన రామగుండం నగరపాలక సంస్థ ఇప్పుడు చెత్త కష్టాలు ఎదుర్కొంటోంది. కీలకమైన డంపింగ్ యార్డుకు స్థలం లేకపోవడంతో చెత్త నిర్వహణ అటకెక్కింది. ఎంతో శ్రమించి ఇంటింటి నుంచి సేకరిస్తున్న తడి, పొడి చెత్తను పోసేందుకు డంపింగ్‌యార్డు లేకపోవడంతో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ కుప్పలుగా పోయాల్సిన పరిస్థితులు తలెత్తున్నాయి. దీంతో కలెక్టర్, లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ జోక్యం మేరకు స్పందించిన సింగరేణి సంస్థ డంపింగ్ యార్డు కోసం మూతపడిన ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ (ఓసీపీ)-4 ప్రాంతంలో సుమారు 10 ఎకరాల స్థలం ఇచ్చేందుకు అంగీకరించింది. దీంతో బల్దియా అధికారులు 15 రోజులుగా ఈ స్థలాన్ని డంపింగ్‌యార్డుకు అనుకూలంగా మార్చేందుకు చదును చేస్తున్నారు. సమీపంలోని మేడిపల్లి ప్రాంతవాసులు మాత్రం డంపింగ్‌యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు. మంగళవారం పనులు కూడా అడ్డుకున్నారు. విరమించుకోకుంటే జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

**అడుగడుగునా.. ఆటంకాలే..**

- నగరపాలక సంస్థలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు తరుచూ ఆటంకాలు ఎదురవుతున్నాయి. 20 ఏళ్లుగా శాశ్వత డంపింగ్ యార్డు ఏర్పాటు చేయలేకపోతున్నారు.
- పదేళ్ల క్రితం రామగుండంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి అవపరమైన యంత్రాలు సమకూర్చి చుట్టూ ప్రహరీ కూడా నిర్మించారు. కానీ చెత్తపోయడాన్ని స్థానికులు అడ్డుకోవడంతోపాటు చెత్తను తరలించిన డ్రైవర్లపై దాడులకు పాల్పడిన సంఘటనలతో నిలిచింది.
- గతంలో సింగరేణి సంస్థ జల్లారం శివారులో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ స్థలంలోనే కొంత కాలం గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, సింగరేణి, ఎన్టీపీసీ ప్రాంతాల నుంచి చెత్తను తరలించారు. ఆ తర్వాత ఓసీపీ-5 ప్రాజెక్ట్ ఏర్పాటు కావడంతో, ప్రత్యామ్నాయంగా మరో చోట స్థలం కేటాయిస్తామని చెప్పిన సింగరేణి డంపింగ్ యార్డు స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. స్థలం కేటాయింపు జాప్యం కావడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి.
- వీకే రామయ్య కాలనీ సమీపంలోని రాముని గుండాలగుట్ట వద్ద క్వారీల స్థలాన్ని రెవెన్యూ అధికారులు డంపింగ్‌యార్డుకు సూచించారు. ఆ ప్రాంతవాసులు అడ్డుకోగా నిలిచింది.
- లక్ష్మీపురం సమీపంలోని ఆర్ఎఫ్‌సీఎల్‌కు చెందిన ఖాళీ స్థలంలో చెత్తను డంప్ చేయగా, స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు సమీప ప్రాంతవాసులు వ్యతిరేకిస్తూ అడ్డుకోవడంతో ఆగింది.
- గత్యంతరం లేక గోదావరి ఒడ్డున సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంతంతో పాటు హిందూ శ్మశాన వాటికకు వెళ్లే దారిలో రోడ్డు ప్రక్కన చెత్తను కుప్పలుగా పోసి కాల్చివేశారు. తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం కావడంతో చెత్త తరలింపును నిలిపేశారు.
- గోదావరి ఒడ్డున ఆర్ఎఫ్‌సీఎల్‌కు చెందిన స్థలాన్ని ఇటీవల కాలంలో డంపింగ్ యార్డుకు ఉపయోగిస్తున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థ అధికారులు తొలుత చెత్త వాహనాలు రాకుండా రోడ్డుకు అడ్డంగా స్తంభాలు పాతి హెచ్చరిక బోర్డు పెట్టారు. ప్రస్తుతం అధికారుల చొరవతో ఈ స్థలంలోనే చెత్త పోస్తున్నారు.
- తాజాగా మూసివేసిన ఓసీపీ-4 ప్రాజెక్టు స్థలాన్ని డింపింగ్ యార్డుకు ఉపయోగించుకోవచ్చని సింగరేణి యాజమాన్యం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 15 రోజులుగా ఆ స్థలాన్ని జేసీ బీ వాహనంతో అధికారులు చదును చేయిస్తున్నారు. కార్పొరేటర్లతో పాటు సమీప ప్రాంతవాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

### ప్రయత్నాలు విరమించుకోవాలి



ఓసీపీ-4 ప్రాంతాన్ని డంపింగ్‌యార్డుగా చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలి. లేకుంటే మేడిపల్లి, మల్కాపూర్, జంగాలపల్లి గ్రామప్రజలతో కలిసి జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తాం. మేడిపల్లి ఓపెన్‌కాస్టుతో నరకయాతకు గురయ్యాం. ఇప్పుడు డంపింగ్‌యార్డుతో దుర్వాసన పెరగంతో పాటు కాలుష్యం వెదజల్లుతోంది.
– కుమ్మరి శ్రీనివాస్, 3వ డివిజన్ కార్పొరేటర్

### ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



ఓసీపీ-4 ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డుతో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. డంపింగ్‌యార్డు చెత్తతో బయో మైనింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం. డీఆర్‌సీసీ సెంటర్ పెడుతాం. తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ అక్కడే నిర్వహించి, చెత్తతో సేంద్రియ ఎరువు కూడా తయారు చేయిస్తాం.
– జె.అరుణశ్రీ,అడిషనల్ కలెక్టర్(లోకల్‌బాడీస్)

**రామగుండం బల్దియా సమాచారం**

| | |
|---|---|
| డివిజన్‌లు: | 50 |
| వైశాల్యం: | 93.87 చదరపు కిలోమీటర్లు |
| జనాభా: | 2,29,644(2011జనాభా లెక్కల ప్రకారం) |
| మొత్తం నివాసాలు: | 64వేలు |
| పారిశుద్ధ్య కార్మికులు: | 448 మంది |
| ర్యాగ్ పిక్కర్లు: | 100 మంది |
| రోజూ వెలువడే చెత్త: | 118 మెట్రిక్ టన్నులు |
| చెత్త సేకరణకు: | 53 ఆటో ట్రాలీలు |
| చెత్త సేకరించే ట్రాక్టర్లు: | 19 |
| అత్యాధునిక వాహనాలు: | రూ.6కోట్ల విలువైనవి |

## క్లుప్తంగా

### బావిలో పడి వృద్ధుడి మృతి

**జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్‌కు చెందిన ఈదుల రామయ్య(70) బావిలో పడి మృతిచెందాడని ఎస్సై సదాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రామయ్యకు కొంతకాలంగా కళ్లు కనిపించడం లేదు. మంగళవారం ఇంటికి సమీపంలోని తోట వద్దకు వెళ్తూ.. ప్రమాదవశాత్తు కాలు జారి, బావిలో పడ్డాడు. మృతుడి తమ్ముడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



**కొండగట్టు(చొప్పదండి):** కొడిమ్యాల మండలం పూడూరు శివారులోని పొలం వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు తమకు సమాచారం అందించాలని కోరారు.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి



సాయికుమార్ (ఫైల్)


**ముత్తారం(మంథని):** ముత్తారం మండలంలోని లక్కారానికి చెందిన కురాకుల సాయి కుమార్(22) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. కురాకుల సమ్మయ్య-కళావతి దంపతుల కుమారుడు సాయికుమార్ డిగ్రీ చదివాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని పలు పోటీ పరీక్షలు రాశాడు. ఒక్క ఉద్యోగం కూడా రాలేదన్న మనస్తాపంతో ఈ నెల 16న క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

**సుల్తానాబాద్‌రూరల్:** తాళం వేసిన ఇంట్లో చొరబడిన దుండగులు టీవీ ఎత్తుకెళ్లారు. ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వంగల శ్రీనివాస్ ఈ నెల 17న ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. సోమవారం రాత్రి తిరిగిరాగా, తాళం పగులకొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. అందులో ఏమీ దొరక్కపోవడంతో రూ.48 వేల విలువైన స్మార్ట్ టీవీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని శ్రీనివాస్ తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# అందని ద్రాక్షలా అధిక పింఛన్

- 1995 నుంచి వివరాలు కావాలని ఈపీఎఫ్‌వో మెలిక
- డిమాండ్ నోటీసు మేరకు అడిగిన సొమ్ము చెల్లించిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు
- కొందరి దరఖాస్తులు తిరస్కరణ
- ఉమ్మడి జిల్లాలో రిటైరైనవారు సుమారు 4,800 మంది



హుజూరాబాద్‌లో ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి పత్రం ఇస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు (ఫైల్)

**హుజూరాబాద్:** ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాష్ట్రంలో 11 ఆర్టీసీ రీజియన్లు ఉన్నాయి. సుమారు 48 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. మరో 30 వేల మంది ఉద్యోగ విరమణ పొందారు. వీరిలో 20 వేల మంది అధిక పింఛన్‌కు అనర్హులేతే.. సుమారు 10 వేల మంది ఎంపికయ్యారు. కానీ, పింఛన్ రాక కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారు.

**దాదాపు 200 మందికే..**

సుప్రీంకోర్టు తీర్పు మేరకు 01.09.2014 నుంచి ఉద్యోగ విరమణ పొందిన వారిలో అర్హులైనవారు అధిక పింఛన్ కోసం ఈపీఎఫ్‌వోకు దరఖాస్తు చేశారు. రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు పింఛన్ వస్తుందని ఆశపడ్డారు. నిబంధనల మేరకు ఒక్కొక్కరు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు డీడీల రూపంలో చెల్లించారు. వీరిలో దాదాపు 200 మందికే అధిక పింఛన్ అందుతోంది. కానీ, నేటికీ ఏరియర్స్ రావడం లేదంటున్నారు.

**ఇష్టానుసారంగా మంజూరు..**

రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ ఇచ్చిన డిమాండ్ లెటర్ ఆధారంగా రిటైర్డ్ ఉద్యోగులు గతేడాది ఏప్రిల్, మేలో డీడీలను ఈపీఎఫ్‌వోకు పంపించారు. అయితే, సీరియల్ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా అధిక పింఛన్ మంజూరు చేస్తూ గత జూన్, జూలై నెలల్లో ఈపీఎఫ్‌వోకు పంపించినట్లు ఆరోపణలున్నాయి. జిల్లా కార్యాలయంలో 6 నెలలు గడిచినా పింఛన్ మంజూరు చేయడం లేదు. దీంతో పింఛన్ పొందకుండానే కొందరు చనిపోయారు. మరికొందరు అనారోగ్యానికి గురయ్యారు. ఇంకొందరు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

### మందులకు సరిపోవడం లేదు



ఆర్టీసీలో పని చేస్తున్న సమయంలో సంస్థ సూచనతో అధిక పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న. కానీ, ప్రస్తుతం రూ.1,140 మాత్రమే వస్తోంది. ఈ డబ్బులు మందులకు కూడా సరిపోవడం లేదు. నాకు ఇద్దరు బిడ్డలు, ఒక కొడుకు ఉన్నారు. 21 ఏళ్లు ఆర్టీసీలో పనిచేశా. రిటైరయ్యాక సంస్థ భరోసా ఇస్తుందని ఆశపడితే అలా జరగలేదు. కులవృత్తి చేసుకుంటూ బతుకుతున్న.

– రంగు పందరి, రిటైర్డ్ కండక్టర్, హుజూరాబాద్

### ఇద్దరు చనిపోయారు



సుప్రీంకోర్టు తీర్పు మేరకు అధిక పింఛన్ వస్తుందని అప్పు చేసి మరీ ఈపీఎఫ్‌కు లక్షల రూపాయలు చెల్లించినం, ఇప్పటికీ పింఛన్ రావడం లేదు. పూట గడవటం కష్టంగా ఉంది. పట్టణానికి చెందిన అప్పాని రాములు, మొలుగు కొమురయ్య అనే రిటైర్డ్ ఉద్యోలు అధిక పింఛన్ తీసుకోకుండానే అనారోగ్యంతో చనిపోయారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

– వేల్పుల ప్రభాకర్, రిటైర్డ్ కండక్టర్, హుజూరాబాద్

### అర్హత ఉన్నా జాప్యం..



సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అధిక పింఛన్‌కు అర్హత ఉన్నా మంజూరులో జాప్యం జరుగుతోంది. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశాం. మేము కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితుల్లో ఉన్నాం.

– తౌటం సంపత్‌కుమార్, హుజూరాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం

### రూ.1,900తో కుటుంబ పోషణ ఎలా?



నేను ఆర్టీసీలో 35 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పని చేశాను. అధిక పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే రూ.1,900 మాత్రమే వస్తోంది. ఈ డబ్బుతో నా కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో సంస్థ, అధికారులు చెప్పాలి.

– రుద్రోజు చారి, రిటైర్డ్ డ్రైవర్, హుజూరాబాద్

### అందరికీ ఒకేసారి ఇవ్వాలి



రాష్ట్రవ్యాప్తంగా రిటైరైన వేలాది మంది ఆర్టీసీ ఉద్యోగులు డీడీల రూపంలో లక్షల రూపాయలు చెల్లించారు. అధిక పింఛన్ రాకపోవడంతో 10 నెలలుగా ఆందోళన చెందుతున్నారు. కార్యాలయం చుట్టూ తిరగడానికి వయసు రీత్యా మా శరీరం సహకరించడం లేదు. అందరికీ ఒకేసారి ఇవ్వాలి.

– మార్త రవీందర్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యుడు, హుజూరాబాద్

# వరికి మొగి పురుగు, అగ్గి తెగులు

- పొలాలను పరిశీలించిన పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తలు



పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**జగిత్యాల అగ్రికల్చర్:** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సాగు చేసిన వరి పంటను తొలి దశలోనే మొగి పురుగు, అగ్గి తెగులు, జింక్, సల్ఫైడ్ సమస్యలు వేధిస్తున్నాయని రైతులు పొలాస శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు పొలాస వ్యవసాయ పరిశోధన స్థానానికి చెందిన శాస్త్రవేత్తలు బలరాం, రజనీకాంత్, సాయినాథ్, స్వాతి మంగళవారం జగిత్యాల, బుగ్గారం, ధర్మపురి మండలాల్లో పర్యటించి, పొలాలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. వరిలో మొగి పురుగు నివారణకు.. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలను ఎకరానికి 8 కిలోలు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.4జి గుళికలను 4 కిలోల చప్పున చల్లుకోవాలని సూచించారు. అలాగే, అగ్గి తెగులు నివారణకు ఇసోప్రోథియోలిన్ 0.6 గ్రాముల మందును లీటర్ నీటికి కలిపి, పిచికారీ చేయాలన్నారు. వరిలో జింక్ లోప నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి, పిచికారి చేయాలని పేర్కొన్నారు. సల్ఫైడ్ దుష్ప్రభావాన్ని తగ్గించేందుకు.. మొక్క వేర్లకు గాలి తగిలేలా మురుగు నీటిని తీసి, మళ్లీ నీరు పెట్టాలని సూచించారు. ఈ దశలో కాంప్లెక్స్, అమ్మోనియం సల్ఫేట్ వంటి ఎరువులు వాడొద్దని చెప్పారు.

### గిడుగు స్మారక జాతీయ పురస్కారానికి ఎంపిక



ఉమాపతి

**కరీంనగర్ కల్చరల్:** కరీంనగర్‌లోని గాయత్రినగర్‌కు చెందిన ప్రముఖ కవి గంప ఉమాపతి గిడుగు రామ్మూర్తి పంతులు స్మారక జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో అవార్డు అందుకోనున్నారు. సామాజిక అంశంలో.. ఎందుకిలా అనే పుస్తకం రాసిన ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

### గల్ఫ్ పంపిస్తానని మోసం.. వ్యక్తికి జైలు

**మేడిపల్లి:** దుబాయ్ పంపిస్తానని డబ్బులు తీసుకొని, మోసగించిన కేసులో ఓ వ్యక్తికి కోరుట్ల జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు జైలుశిక్ష విధించింది. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా పిప్పిరి మండలం బీంగల్ గ్రామానికి చెందిన ఏగోలం మనోజ్‌కుమార్ మేడిపల్లి మండలంలోని రాగోజిపేటకు చెందిన ఆరుగురిని దుబాయ్ పంపిస్తానన్నాడు. వారి వద్ద రూ.40 వేల చొప్పున తీసుకున్నాడు. తర్వాత వారిని దుబాయ్ పంపలేదు. బాధితుల్లో ఒకరైన రాపల్లి నగేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సరైన ఆధారాలు కోర్టు సమర్పించినట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు. నేరం రుజువు కావడంతో కోర్టు మనోజ్‌కుమార్‌కు మంగళవారం మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.1,000 జరిమానా విధించిందని పేర్కొన్నారు.

### చోరీ కేసులో వ్యక్తికి జైలు

**సిరిసిల్ల కల్చరల్:** చోరీ కేసులో ఓ వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. గతేడాది మే 4న ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి పెద్దమ్మ గుడిలో అమ్మవారి పుస్తె, మెట్టెలు చోరీకి గురయ్యాయి. గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గాడిచెర్ల రామచంద్రం ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు వేములవాడ మండలం ఫాజుల్‌నగర్‌కు చెందిన శివరాత్రి సంపత్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సందీప్ కేసు వాదించారు. కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీందర్ నాయుడు, కానిస్టేబుల్ దేవేందర్ సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో మంగళవారం సంపత్‌కు జడ్జి శిక్ష ఖరారు చేశారు.

### వైన్స్ వద్ద బైక్ చోరీ

- వాహనం బ్యాగులో రూ.84 వేలు

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** వైన్స్ వద్ద నిలిపిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఎస్సై రమాకాంత్ కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సయ్యద్ జావిద్ మంగళవారం రాచర్లగొల్లపల్లి శివారులోని వైన్స్ వద్ద బైక్ నిలిపాడు. మద్యం కొనుగోలు చేసి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. బైక్ బ్యాగులో రూ.84 ఉన్నాయని, వాహనంతోపాటు డబ్బులను దుండగులు ఎత్తుకెళ్లారంటూ లబోదిబోమన్నాడు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# 350 బిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

- 2024–25లో 295 రోజుల్లోనే లక్ష్యాన్ని చేరిన ఎన్టీపీసీ



తెలంగాణ స్టేజ్–1 ప్రాజెక్టు

**జ్యోతినగర్(రామగుండం):** ఎన్టీపీసీ సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరంలో 350 బిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి, లక్ష్యాన్ని చేరుకుంది. మంగళవారం సంబంధిత వివరాలను అధికారికంగా వెల్లడించారు. ఎన్టీపీసీ విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని 295 రోజుల్లోనే సాధించింది. ఇది గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 11 రోజులు ముందు. ఎన్టీపీసీ 76.5 గిగావాట్ల స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉండగా.. 9.6 గిగావాట్ల పునరుత్పాదక సామర్థ్యంతో సహా 29.5 గిగావాట్ల సామర్థ్యం ఉంది. 2032 నాటికి 60 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడానికి కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేసింది.

**కొత్త వ్యాపారాల్లోకి అడుగు..**

విద్యుదుత్పత్తితోపాటు ఎన్టీపీసీ ఈ–మొబిలిటీ, బ్యాటరీ నిల్వ, పంప్డ్ హైడ్రో నిల్వ, వేస్ట్ టు ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ సొల్యూషన్స్ వంటి వివిధ కొత్త వ్యాపారాల్లోకి కూడా అడుగుపెట్టింది. కేంద్ర పాలిత ప్రాంతాలకు విద్యుత్ పంపిణీ కోసం బిడ్డింగ్‌లో సైతం పాల్గొంది. ఎన్టీపీసీ సంస్థ దేశంలోని అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ పవర్ యుటిలిటీగా నిలిచింది. దేశ విద్యుత్‌లో 1/4 వంతు అందిస్తోంది. థర్మల్, హైడ్రో, సోలార్, విండ్ పవర్ ప్లాంట్లతో దేశానికి విద్యుత్ సరఫరా చేస్తోంది.

**ఎన్టీపీసీ రామగుండంది ప్రధాన పాత్ర**

ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు దేశానికి విద్యుత్ అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. థర్మల్ విద్యుత్ 2,600 మెగావాట్లు, తెలంగాణ స్టేజ్–1లో 1,600 మెగావాట్లు, ఫ్లోటింగ్ సోలార్ 100 మెగావాట్లు, గ్రౌండ్ సోలార్ ప్రాజెక్టు 10 మెగావాట్ల విద్యుత్ అందిస్తోంది. తెలంగాణ స్టేజ్–2లో 2,400 మెగావాట్లతోపాటు ఫ్లోటింగ్ సోలార్ 56 మెగావాట్లు, 120 గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి.

### వరకట్న వేధింపుల కేసు

**మల్యాల(చొప్పదండి):** భార్యను అదనపు వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మల్యాల మండలం నూకపల్లి డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన పాలవేణి జయకృష్ణ-నివేదిత దంపతులు. మద్యానికి బానిసైన జయకృష్ణ అదనంగా కట్నం తీసుకురావాలంటూ భార్యను తరచూ వేధిస్తున్నాడు. ఈ నెల 20న ఆమెపై దాడి చేయడంతో గాయపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం జయకృష్ణపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### క్రిమిసంహారక మందు తాగి ఇంటికి నిప్పు

- బాధితుడిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు

**ఇల్లందకుంట(హుజూరాబాద్):** క్రిమిసంహారక మందు తాగిన ఓ వ్యక్తి తన ఇంటికి నిప్పు పెట్టిన ఘటన ఇల్లందకుంట మండలంలోని మల్యాలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాలకు చెందిన చందగల్ల సాంబయ్య మంగళవారం తెల్లవారుజామున క్రిమిసంహారక మందు తాగి, ఇంటికి నిప్పు పెట్టాడు. గమనించిన స్థానికులు 100కు ఫోన్ చేయడంతో సీఐ కిశోర్, ఎస్సై రాజ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చి, మంటలు ఆర్పివేశారు. అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని పోలీస్ వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. కాగా, సాంబయ్య భార్య ఇటీవలే అతనితో గొడవపడి, హైదరాబాద్‌లోని కూతురు వద్దకు వెళ్లినట్లు సమాచారం.

### వ్యక్తి మృతికి కారణమైన నలుగురి అరెస్ట్

**వేములవాడ:** ఇటీవల వేములవాడ పట్టణం భగవంతరావునగర్‌కు చెందిన ఎస్కూరి రాజేందర్, దుర్గం రాజేందర్, దుర్గం శంకరయ్యపై మద్యం మత్తులో నలుగురు విచక్షణారహితంగా దాడి చేయగా, బాధితులను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఇందులో ఎస్కూరి రాజేందర్ చికిత్స పొందుతూ ఈనెల 18న చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాజేందర్ మృతికి కారకులైన పట్టణానికి చెందిన కోగిల నగేశ్, గుగులోతు రాకేశ్, ఎడెల్లి హర్షక్, వంగల మంజునాథ్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరిగే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# అమ్మానాన్న కనిపించట్లేదని ఆత్మహత్యాయత్నం

- తమ్ముడి అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం
- ఆస్పత్రిలో కోలుకుంటున్న చిన్నారి
- ఘటనపై అనుమానాలు



చికిత్స పొందుతున్న రిత్విక్

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** నిద్ర లేవగానే అమ్మానాన్న కనిపించకపోవడంతో ఎనిమిదేళ్ల చిన్నారి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు.. విషయాన్ని తమ్ముడికి చెప్పడంతో భయపడి, చుట్టుపక్కల వారిని పిలవడంతో ప్రాణాపాయం తప్పింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లి చెరువు తండాకు చెందిన సంతోష్-స్వర్ణ దంపతులకు ఇద్దరు కుమారులు రిత్విక్, రక్షిత్ ఉన్నారు. సంతోష్ బంధువులు సోమవారం రాత్రి ఘర్షణ పడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వారిని స్వర్ణ ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. చికిత్స కొనసాగుతుండటంతో రాత్రి ఆస్పత్రిలోనే ఉంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న సంతోష్ మంగళవారం ఉదయం పిల్లలు నిద్ర లేవకముందే గ్రామసభపై ప్రచారం చేసేందుకు ఊళ్లోకి వెళ్లాడు. కాసేపటికి నిద్ర లేచిన పిల్లలు అమ్మానాన్న కనిపించకపోవడంతో భయపడ్డారు. అప్పటికే ఇంటి బయట ఆడుకుంటున్న చుట్టుపక్కల పిల్లలు మీ అమ్మ కనిపించడం లేదని తప్పుడు సమాచారం ఇవ్వడంతో ఆందోళనకు గురయ్యారు. ఇంట్లోకి వెళ్లిన రిత్విక్.. అమ్మానాన్న కనిపించడం లేదని.. తాను ఉరివేసుకుంటున్నానని తమ్ముడికి చెప్పాడు. వెంటనే స్టూల్ పైకి ఎక్కి, చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. రక్షిత్ భయపడి, చుట్టుపక్కల వారికి తెలుపడంతో వచ్చి, రిత్విక్‌ను కాపాడారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ చిన్నారికి ప్రాణాపాయం తప్పింది. అయితే, ఇద్దరు పిల్లల వయసు పదేళ్లలోపే ఉండటం, ఉరేసుకునేందుకు ప్రయత్నించడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తన కొడుకు ఉరివేసుకోవడంపై అనుమానం ఉందని చిన్నారి తండ్రి సంతోష్ తెలిపాడు. బాబు పూర్తిగా కోలుకున్న తర్వాత అసలు విషయం తెలుస్తుందని చెప్పాడు.

# లోన్ ఇప్పిస్తామంటూ.. మాటల్లో దింపి

- రూ.3 వేలు లాక్కొని, పరారైన గుర్తు తెలియని దంపతులు



బాధితులు

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** లోన్ ఇప్పిస్తామంటూ వృద్ధ దంపతులను మాటల్లో దింపిన గుర్తు తెలియని దంపతులు వారి వద్ద నుంచి రూ.3 వేలు లాక్కొని, పరారయ్యారు. బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలంలోని అక్కపెల్లికి చెందిన సుంకరి మల్లయ్య-అమృత దంపతులు. గ్రామసభలు ప్రారంభం కావడంతో ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకునేందుకు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. గుర్తు తెలియని దంపతులు వీరిని గమనించి, వెంబడించారు. బస్టాండ్‌వైపు వెళ్తుంటే వెనకాలే వెళ్లి, మాటలు కలిపారు. ప్రభుత్వ పథకాల సమాచారం కోసం వచ్చినట్లు తెలుసుకొని, వారికి రూ.50 వేల లోన్ ఇప్పిస్తామని చెప్పారు. తర్వాత రూ.3 వేలు లాక్కొని, పారిపోయారు. బాధితులు రోదిస్తూ సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులు వివరాలు తెలుసుకొని, నిందితుల కోసం గాలిస్తున్నారు.

# షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి, పత్తి దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



కాలిన పత్తిని చూస్తూ రోదిస్తున్న బాధితులు

**బుగ్గారం(ధర్మపురి):** షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన ధర్మపురి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ధర్మపురి హనుమాన్‌వాడకు చెందిన ఆకుల గంగన్న కుటుంబసభ్యులు ముంబయిలో ఉంటున్నారు. స్థానిక వీరి ఇంట్లో కొంతకాలంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలు అద్దెకు ఉంటున్నారు. ఇటీవల వారు తమ స్వగ్రామానికి వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ జరగడంతో సామగ్రి కాలిపోయింది. పొగ రావడాన్ని గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చి, మంటలు ఆర్పివేశారు.

**చొప్పదండి:** షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధమైన ఘటన చొప్పదండి పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని మార్కెట్ రోడ్డుకు చెందిన బండారి బీరయ్య అనే రైతు పత్తిని రేకుల షెడ్డులో నిల్వ ఉంచాడు. మంగళవారం షార్ట్‌సర్క్యూట్ జరగడంతో సుమారు 30 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. ధరలు పెరుగుతాయని డీ–86 ఉప కాలువ సమీపంలో రేకుల షెడ్డు అద్దెకు తీసుకొని, పత్తి నిల్వ ఉంచామంటూ బీరయ్య దంపతులు రోదించారు.

# ఆర్జీ-1 ఏరియాలో కార్మికులకు గాయాలు



బాధితుడిని పరామర్శిస్తున్న సత్తయ్య

**గోదావరిఖని(రామగుండం):** సింగరేణి రామగుండం డివిజన్–1 పరిధిలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. జీడీకే–11 గనిలో కంటిన్యూస్ మైనర్‌లో తేళ్ల సతీశ్ అనే జనరల్ మజ్దూర్ గునపంతో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు అరచేతికి గాయాలయ్యాయి. అతన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. అలాగే, ఆర్జీ–1 సీఎస్‌పీలో వెల్డింగ్ పనులు నిర్వహిస్తుండగా జనరల్ మజ్దూర్ కార్మికుడు నారదాసు సిద్ధ రాజయ్య కుడి చేతి వేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని హుటాహుటిన సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. కాగా, రక్షణ చర్యల్లో వైఫల్యం వల్లే రెండు ప్రమాదాలు జరిగాయని, నిపుణులైన ఉద్యోగులచే పనులు నిర్వహిస్తే జరిగేవి కావని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ఆరోపించారు. రక్షణ విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.





ఆరాధనోత్సవాల్లో పాడుతున్న పిన్ని-కూతురు అపర్ణ-భావన, అక్కాచెల్లెలు హరిప్రియ, శణ్ముఖప్రియ

# రాగంలో రాణిస్తున్న రక్తసంబంధీకులు

- మృదంగం, సంగీత కీబోర్డుతో సోదరులు..
- రాజన్న క్షేత్రం వేదికపై ప్రతిభ
- శభాష్ అంటున్న కళాభిమానులు

**వేములవాడ:** వారంతా రక్తసంబంధీకులు. తమలోని కళను, ప్రతిభను చాటిచెప్పుకునేందుకు వేములవాడ రాజన్న క్షేత్రం వేదికగా నిలిచింది. జగద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో తమ రాగంతో, మృదంగం వాయిస్తూ కళాభిమానులను కట్టిపడేస్తున్నారు. చెన్నైకి చెందిన ప్రముఖ గాయకులు, ప్రియ సిస్టర్స్‌గా పేరొందిన హరిప్రియ, శణ్ముఖప్రియ తమ గళంతో శభాష్ అనిపించుకుంటున్నారు. వేములవాడకు చెందిన పిన్ని-కూతురు ఉపాధ్యాయుల అపర్ణ-భావన తమ మధుర స్వరంతో కీర్తనలు ఆలపిస్తున్నారు. మైదుకూరుకు చెందిన కొండపల్లి నటరాజ్ మృదంగం, అతని సోదరుడు ఉదయ్‌కుమార్ సంగీత కీబోర్డు వాయిస్తూ ప్రతిభ చాటుకుంటున్నారు. విజయవాడకు చెందిన విష్ణుభట్ల సిస్టర్స్‌గా పేరొందిన సరస్వతి, కృష్ణవేణిలు తమ రాగంతో సభికులను ఆకట్టుకుంటున్నారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు శరత్‌శర్మ వారిని సత్కరించారు.



అక్కాచెల్లెలు సరస్వతి, కృష్ణవేణి



సోదరులు నటరాజ్-ఉదయ్‌కుమార్